క్లుప్తంగా

14న అయ్యప్ప స్వాధ్యాయ మహా యజ్ఞం

బోట్‌క్లబ్: స్థానిక భానుగుడి జంక్షన్ సమీపంలో పోలీస్ రిజర్వులైన్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో ఈ నెల 14న అయ్యప్ప స్వాధ్యాయ మహా యజ్ఞం నిర్వహించనున్నారు. డాల్ఫిన్ గార్డెన్ రెస్టారెంట్ అధినేత బది రెడ్డి వెంకన్నస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మచారెడ్డి స్వామి ఆదివారం విలేకర్లకు తెలిపారు. దండపాణి గురుస్వామి ఆశీస్సులతో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పాల కావడి పూజతో పాటు అయ్యప్ప పడి పూజను కుమార్ వేలు గురుస్వామి, మాధవకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆ రోజు ఉదయం నాలుగున్నర గంటలకు గణపతి హోమం, ఐదు గంటలకు స్వామివార్లకు అభిషేకాలు, ఐదున్నర గంటలకు అయ్యప్ప శతనామావళి, ఏడున్నర గంటలకు దేవతామూర్తుల వేషధారణలతో చండీ మేళ వాయిద్యాలతో 108 కన్నె స్వాముల పాల కావడిలతో ఊరేగింపు జరుగుతుందన్నారు. ఎనిమిదిన్నర గంటలకు కుమారస్వామికి 108 లీటర్ల ఆవుపాలతో అభిషేకం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం భిక్ష, రాత్రి 10 గంటలకు పడి నిర్వహిస్తారన్నారు.

19న బౌద్ధ సదస్సు



బౌద్ధ సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బాబ్జీ తదిరులు

బోట్‌క్లబ్: స్థానిక అంబేద్కర్‌భవన్‌లో ఈనెల 19న బౌద్ధ సదుస్సు నిర్వహిస్తున్నట్లు బుద్ధవిహార్ అధ్యక్షుడు కె.బాబ్జీ తెలిపారు. సదస్సు కరపత్రాన్ని స్థానిక అంబేడ్కర్ బుద్ధ విహార్‌లో ఆదివారం ఆవిష్కరించారు. బౌద్ధ ధమ్మం భారతదేశంలో పుట్టి ప్రపంచదేశాలకు విస్తరించి ప్రపంచ శాంతికి పునాదులు వేసిందన్నారు. అటువంటి విశిష్టమైన ధమ్మం నేటి కాలంలో అత్యంత ఆవశ్యకమని అటువంటి ధమ్మం ప్రత్యేకతను, ఆచరణ వలన కలిగే ప్రయోజనాలను తెలియజేస్తూ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సదస్సులో బౌద్ధ ధమ్మం వ్యాప్తికి విశేష కృషి చేస్తున్న ఉభయ రాష్ట్రాల ప్రముఖులు విశ్రాంత ఐపీఎస్ అధికారి సి.ఆంజనేయరెడ్డి, పురావస్తు శాఖ అధికారి ఈమని శివ నాగిరెడ్డి, ఎన్.సిద్ధోజీరావు, వై. సత్యనారాయణ, మోకా సత్తిబాబు, శ్రీరాములు ప్రసంగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఎన్ మూర్తి, రామ్‌ప్రసాద్, భానుమతి బుద్ధ విహార కార్యదర్శి కె.రామారావు, ఉపాధ్యక్షులు డి.వెంకటరావు, ఎం.రమేష్, నూకరాజు, సుబ్బారావు, మౌర్య, కృష్ణారావు పాల్గొన్నారు.

కోటి సంతకాల పోస్టర్ ఆవిష్కరణ



కోటి సంతకాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాకినాడ రూరల్: మండలంలోని గంగనాపల్లిలో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఏ కరీం బాషా ఆధ్వర్యంలో కోటి సంతకాల ప్రజా ఉద్యమ పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలను ప్రస్తుత ప్రభుత్వం ప్రైవేటీకరించేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఖండించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఎండీ చాంద్ బాషా, ఎండీ గౌస్, మహబూబ్ హుస్సేన్, షేక్ జిలాని, మస్తాన్, బషీర్, తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణపై నేడు అవగాహన సదస్సు

కాకినాడ రూరల్: రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంపై కాకినాడ రూరల్‌లో సోమవారం ఉదయం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి, నియోజకవర్గ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు తెలిపారు. కాకినాడ రమణీయ్యపేట వైద్య నగర్‌లోని క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం ఉదయం కోటి సంతకాలపై అవగాహన కల్పిస్తామన్నారు. గ్రామాలలో రచ్చబండ కార్యక్రమం ద్వారా అన్ని వర్గాల ప్రజల నుంచి సంతకాలు ఏ విధంగా సేకరించాలో తెలియజేస్తామన్నారు. కార్యక్రమానికి రూరల్ మండలం కరప, అర్బన్ డివిజన్‌లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలన్నారు.

15న వ్యాస రచన, వక్తృత్వ పోటీలు

సామర్లకోట: భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీన విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు మదర్ థెరిసా స్వచ్ఛంద సంస్థ అధినేత జి.రాజు ఆదివారం తెలిపారు. ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 3, 4, 5 తరగతి విద్యార్థులను సబ్ జూనియర్స్‌గా, 6, 7, 8 తరగతుల విద్యార్థులను జూనియర్స్‌గా, 9, 10 తరగతుల విద్యార్థులను సీనియర్స్‌గా గుర్తించి పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి స్థానిక శిక్షణ మరియు సాంకేతిక అభివృద్ధి కేంద్రం (టీటీడీసీ)లో పోటీలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వక్తృత్వ పోటీల్లో అబ్దుల్ కలామ్ జీవిత చరిత్ర, వ్యాసరచన పోటీల్లో అబ్దుల్ కలామ్ దేశ సేవలపై ఉంటాయని ఆయన చెప్పారు. మధ్యాహ్నం రెండు గంటలకు విజేతలకు మూడు విభాగాల నుంచి బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు.

గోతులతో అగమ్య గోచరం!

- అడుగడుగునా ప్రయాణికుల అవస్థలు
- ప్రమాదాల పాలవడమో.. వాహనాలు మూలన పడడమో..
- బయటికి వెళ్లొచ్చేటప్పటికి ఏదో ఒకటి ఖాయమంటున్న ప్రజలు
- కాకినాడలో రహదారుల పరిస్థితి ఇదీ

మేకతోకకు మేక.. తోక మేకకు తోక అని తెనాలి రామకృష్ణుల వారు చెప్పినట్టుంది కాకినాడలో గోతుల పరిస్థితి. ఒక గొయ్యి తప్పించుకుంటే ఇంకో గొయ్యి.. దానిని తప్పించుకుంటే మరొకటి.. గమ్యానికి చేరుకునేలోపు నడుములు కలుక్కుమనడమో.. వాహనాల నట్లు బోల్టులు విరిగి రోడ్డు పక్కకు చేరడమో జరుగుతోంది. కార్పొరేషన్ స్థాయి నగరమే అయినా నేటికీ మౌలిక వసతుల కల్పనలో అధికారులు వెనకబడే ఉన్నారు. అదేమంటే నిధుల్లేవని.. సిబ్బంది లేరనీ ఏవో సాకులు వల్లెవేస్తుంటారు. ఈ సమస్యకు మోక్షమెప్పుడో.. ప్రజల ప్రాణాలకు భద్రత ఎప్పుడో మరి..



బురదమయంగా మారిన ఎల్‌బీనగర్-ముత్తా వారధి ప్రధాన రహదారి



గొడారిగుంట ప్రగతి కళాశాల రోడ్డులో..



డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద రహదారి దుస్థితి

బోట్‌క్లబ్: పేరుకే కాకినాడ కార్పొరేషన్. నగరంలో ఏ రహదారి చూసినా గోతులమయంగానే ఉంటుంది. చిన్న రహదారులే కాకుండా ప్రధాన రహదారులు సైతం పూర్తిగా గోతులమయం కావడంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. కాకినాడలో సుమారు 5 లక్షల జనాభా ఉన్నారు. వీరితో పాటు జిల్లా కేంద్రం కాకినాడకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి నిత్యం వేలాది మంది వస్తుంటారు. చిన్న రహదారి ఎలాగున్నా ప్రధాన రహదారుల సైతం మోకాలి లోతు గోతులతో నిత్యం వాహనచోదకులను ప్రమాదాల పాలుజేస్తున్నాయి. ఇటీవల క్రమం తప్పకుండా వర్షం పడడంతో గోతుల లోతు తెలియని వాహన చోదకులు మరిన్ని ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానిక అచ్యుతాపురం రైల్వే గేట్ నుంచి కరణం గారి సెంటర్, అశోక్ నగర్, విద్యుత్ నగర్ మీదుగా వచ్చే ప్రధాన రహదారి చాలా అధ్వానంగా తయారైంది. పోనీ వేరొక రహదారిలో వెళదామన్నా ఏ దారి చూసినా అదే పరిస్థితి ఉంటోంది. స్థానిక ఎల్బీ నగర్ నుంచి ముత్తా వారధికి వెళ్లే రహదారి కూడా పూర్తిగా బురదమయంగా తయారైంది దీంతో ప్రయాణికులు ఎటు వెళ్లినా ఇబ్బందులు తప్పని పరిస్థితి నెలకొంది. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే గోతులు లేని రహదారులు ఏర్పాటు చేశామని గొప్పలు చెప్పుకొంటున్న కూటమి నాయకులు ప్రస్తుతం గోతుల పరిస్థితి చూసి ఏం సమాధానం చెబుతారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. స్థానిక బాలా త్రిపుర సుందరి ఆలయం మీదుగా పీఆర్ కాలేజీకి వెళ్లే రహదారి, దేవదాయ శాఖకు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. గోదావరి గుంటలోని ప్రగతి కాలేజీ వద్ద గోతులమయమై అధ్వానంగా ఉండడంతో ఈ ప్రాంత ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. టూ టౌన్ బ్రిడ్జిపై పలు ప్రాంతాల్లో భారీ గోతుల వల్ల నిత్యం వాహన యజమానులు ప్రమాదాలను పడుతున్నారు. ఈ గోతుల వల్ల వేళాపాళా లేకుండా బ్రిడ్జిపై తరచూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. చీకటి పడిన తర్వాత ఈ బ్రిడ్జిపై రావాలంటే ప్రయాణికులు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

బురదమయంగా రహదారి

స్థానిక ఎల్‌బీనగర్ నుంచి ముత్తా వారధికి వెళ్లే రహదారి బురదమయంగా మారింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రెండేళ్ల క్రితం ముత్తా వారధి నిర్మాణం పూర్తి చేసి రాకపోకలకు అనుమతి ఇచ్చారు. ఈ రహదారి అనుసంధానంగా ఉన్న రహదారులు నిర్మించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యింది. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా అటు రామారావుపేటలోని, ఇటు ఎల్‌బీ నగర్, విద్యుత్ నగర్ అనుసంధానం రోడ్డు నిర్మించకపోవడంతో నిత్యం ఇక్కడ ప్రయాణికులు పడరానిపాట్లు పడుతున్నారు. ప్రస్తుతం వర్షం కురవడంతో బురదమయంగా మారడంతో ఈ రహదారిపై ప్రయాణించాలంటే సాహయం చేయాల్సి వస్తోందని ప్రయాణికులు మండిపడుతున్నారు.



మధురానగర్‌లో గోతిలో పడి దెబ్బతిన్న కారు

వాహనాలన్నీ మరమ్మతులే..

స్థానిక మధురానగర్‌లోని వివేకానంద స్కూల్ ప్రధాన రహదారిపై గొయ్యి వల్ల ఇటీవలి కాలంలో రెండు కార్లు ఆ గోతుల్లో పడి పాడయ్యాయి. గోతుల్లో కారు పడటం వల్ల ఆయా వాహన యజమానులకు సుమారు రూ.30 నుంచి రూ.40 వేలతో మరమ్మతు చేయించుకోవాల్సి వచ్చింది. ఇలా నిత్యం ఏదో ఒక ప్రాంతంలో గోతుల్లో పడి ద్విచక్ర వాహనాలు, కార్లు దెబ్బతింటున్నాయి. అయినప్పటికీ కార్పొరేషన్ అధికారులు మాత్రం తమకు ఇవేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

గోతులతో చాలా ఇబ్బందులు పడుతున్నాం



నగరంలో గోతుల వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నాం. నేనే ప్రతి రోజూ కళాశాల పిల్లలను తీసుకువెళ్తుంటాను. నగరంలో పలు రహదారుల్లో ప్రయాణించాల్సి వస్తోంది. ఏ వీధిలో చూసిన గోతులు ఉన్నాయి. వాటిలో పడి ఆటో పాడయిపోతే ఎవరు మరమ్మతులు చేయిస్తారో చెప్పాలి.

జి. కృష్ణ, ఆటో డ్రైవర్

మానసిక ఆరోగ్యంపై అవగాహన

ఆర్ఎంసీ సైకియాట్రీ ఆధ్వర్యంలో ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ వరప్రసాద్ తదితరులు

కాకినాడ క్రైం: ప్రపంచ మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ) మానసిక వైద్య విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సైకియాట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వాసపల్లి వరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ అత్తలూరి విష్ణువర్ధన్ హాజరై ర్యాలీని ప్రారంభించారు. కళాశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ భానుగుడి కూడలి వరకు సాగింది. అక్కడ మానవహారంగా ఏర్పడి మానసిక ఆరోగ్య ప్రాధాన్యాన్ని వివరించారు. డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ, శారీరక ఆరోగ్యాన్ని మానసిక ఆరోగ్యమే ప్రభావితం చేస్తుందని అన్నారు. మూఢ నమ్మకాలతో మానసిక అనారోగ్య బాధితుల్ని ఇంటికి పరిమితం చేయకుండా సకాలంలో నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. మనో వేదనను నిర్లక్ష్యం చేస్తే ఆత్మహత్యకు దారి తీస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, సహ వైద్యులు షరీఫ్, కాటన్, సైకియాట్రీ బృందం, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ శత వసంతోత్సవం



ఆర్ఎస్ఎస్ వందేళ్ల వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు, యువకులు

కరప: ఆర్ఎస్ఎస్ ఏర్పడి వందేళ్లు అయిన సందర్భంగా ఆదివారం వేళంగిలో సానా శ్రీను ఆధ్వర్యంలో శత వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ అంటే క్రమశిక్షణతో భారతీయ హిందూ సమాజాన్ని సంఘటిత పరచి దేశం కోసం, ధర్మం కోసం పనిచేసే సంస్థ అన్నారు. భారతీయ సంస్కృతిని, కుటుంబ వ్యవస్థను పటిష్టపరచడం, పర్యావరణాన్ని పరిరక్షించడం, స్వదేశీ వస్తువులను వినియోగించడం ద్వారా భారతదేశాన్ని శక్తివంతం చేయడానికి యువకులంతా ఆర్ఎస్ఎస్‌లో చేరాలన్నారు. గ్రామస్తులు మెర్ల వీరయ్యచౌదరి, డాక్టర్ బొండా వెంకన్నారావు, నండూరి కృష్ణ, ఉంగరాల శ్రీనివాసరావు, ఈశ్వరరావు, వేళంగి గ్రాడ్యుయేట్ యూత్‌సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శిరిడీ సాయి గ్రామోత్సవం

కరప: సాయి నవరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం స్థానిక పల్లపువీధిలోని గంటాలమ్మ గుడి ఆవరణలో శిరిడిసాయి మందిరంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు ముత్య ప్రసాద్ ఉదయం సుప్రభాత సేవ, కాకడ హారతి, లలిత సహస్రనామాలు, సాయి పారాయణ నిర్వహించారు. 14వ వార్షికోత్సవ సందర్భంగా స్వామివారిని పల్లకిలో ఉంచి సాయి యూత్ ఆధ్వర్యంలో గ్రామోత్సవం జరిపారు. ఈ సందర్భంగా రామచంద్రపురం శ్రీ, భూ సమేత వెంకటేశ్వరస్వామి మహిళా కోలాటం అందరినీ అలరించింది. ఆలయ కమిటీ సభ్యులు, సాయిభక్తులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సోమవారం షిరిడీసాయి గుడివద్ద మహాన్నదానాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.



కరపలో సాగుతున్న సాయి గ్రామోత్సవం

ఆపద సమయంలో బీమా రక్షణ కవచం

తాళ్లరేవు: ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు బీమా రక్షణ కవచంగా నిలుస్తుందని బజాజ్ క్యాపిటల్స్ సంస్థ బ్రాంచి మేనేజర్ మోర్త రాజేష్ తెలిపారు. ఆదివారం స్థానిక లయన్స్‌క్లబ్ భవనంలో బీమాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ప్రమాద బీమా చేయించుకున్న వ్యక్తి ప్రమాదవశాత్తూ మరణిస్తే అతని కుటుంబానికి పెద్ద మొత్తంలో నగదు అందుతుందన్నారు. అదే విధంగా ప్రస్తుతం కలుషితమైన ఆహారం, అధిక ఒత్తిడి కారణంగా అనేక మంది రోగాల బారిన పడుతున్నారని, అటువంటి వారికి ఆరోగ్య బీమా కొండంత అండగా ఉంటుందన్నారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల ప్రమాద బీమా బాండ్లను ఉచితంగా అందజేశారు. సంస్థ సిబ్బంది కట్టా రాజేష్, బి.పెదకాపు, అఖిల్, విజయలక్ష్మి, శ్యాం సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తాళ్లరేవులో దంపతులకు ప్రమాద బీమా బాండ్లను ఉచితంగా అందజేస్తున్న రాజేష్ తదితరులు

నేటి నుంచి కోకనాడ షాపింగ్ సంబరాలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ ధరలు సామాన్య ప్రజలకు తెలిసేలా ఈ నెల 13 నుంచి 19 వరకు కోకనాడ షాపింగ్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక దేవాలయం వీధిలోని పైడా చలమయ్య కళ్యాణ మండపంలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఘాట్‌లో వాహనం బోల్తా

- పర్యాటకుల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): మారేడుమిల్లి, చింతూరు ఘాట్‌రోడ్‌లో ఆదివారం ట్రావెల్స్ వాహనం బోల్తాపడిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కాకినాడలోని ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన 15 మంది సిబ్బంది విహారయాత్ర నిమిత్తం చింతూరు వైపు వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఘాట్‌రోడ్‌లోని కనకదుర్గ గుడి సమీపంలో వారు ప్రయాణిస్తున్న ట్రావెల్స్ వాహనం అదుపుతప్పి పక్కనేఉన్న కల్వర్టులో పడిపోయింది. ఈ ఘటనలో దువ్వా మనోజ్, అయినూరి శ్రీనివాసరావుకు తీవ్రగాయాలు కాగా అటుగా వెళ్తున్న ప్రయాణికులు వీరిని గమనించి చింతూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మిగతా వారికి కూడా స్వల్ప గాయాలయ్యాయి. కాగా మనోజ్ పరిస్థితి విషమంగా ఉండటంతో రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు.



చింతూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

వెంపటి, శోభానాయుడులకు నృత్యాంజలి



నాట్యం చేస్తున్న 60 మంది చిన్నారులు

- ఆకట్టుకున్న బృంద నాట్యం

పిఠాపురం: కళలకు పుట్టినిల్లు, ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న పట్టణంలో చిన్నారి నృత్య కళాకారుల బృందనాట్యం ఆహూతులను ఎంతగానో అలరించింది. స్థానిక కోటగుమ్మం సెంటర్ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం శృతిలయ సంగీత కూచిపూడి నాట్యాలయం ఆధ్వర్యంలో 60 మంది చిన్నారులు ఒకే వేదికపై నృత్యం చేసి అబ్బురపరిచారు. నాట్యాచార్య వెంపటి చిన్న సత్యం జయంతి, పద్మశ్రీ శోభానాయుడు వర్ధంతిని పురస్కరించుకుని కూచిపూడి దినోత్సవంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని శృంగేరి శంకర మఠం శ్రీ మహాలక్ష్మి ఆలయం నుంచి చిన్నారులు ఊరేగింపుగా బయలుదేరి స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఒక బృందంగా ఏర్పడి అంబా పరాకు దేవీ పరాకు.. హరిదరి గజముఖ విఘ్ననాయక అంటూ చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన రంజింపజేశాయి. శృతిలయ సంగీత కూచిపూడి నాట్యాలయ నిర్వాహకురాలు కొత్త ప్రవీణ, విశ్వేశ్వరరావు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ప్రముఖ నాట్యాచార్యులు వీరభద్రరావు, భారత్ పబ్లిక్ స్కూల్ అధినేత గట్టి శ్రీకృష్ణదేవరాయ వెంకట్రావు, లక్ష్మీ కాంతి, ఇంద్రగంటి మీనాక్షి తదితరులు పాల్గొన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు, పుర ప్రజలు కళాకారులను అభినందించారు.



నాట్య ప్రదర్శనకు పూర్వరంగ విధిని ఆలపిస్తున్న కళాకారులు

పేరంటాల అమ్మవారి ఊరేగింపు

సామర్లకోట: స్థానిక ఇస్మాయిల్‌నగర్‌లో కొలువైన పేరంటాల అమ్మవారి సంబరం ఆదివారం భక్తిశ్రద్ధలతో సాగింది. శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని అమ్మవారిని గరగలు, డప్పుల డ్యాన్సులతో ఊరేగించారు. ఆలయం నుంచి మెహర్ కాంప్లెక్స్, మఠం సెంటర్, స్టేషన్ సెంటర్ మీదుగా ఊరేగింపు సాగింది. ఆలయ కమిటీ నాయకులు నమ్మి శ్రీనివాసు, కె.గోవిందు, తాతారావు, డి.అప్పారావు, ఈశ్వరరావు, శివ, వెంకట్, చిన్నకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

గర్ల్స్ హాస్టల్ నిర్మాణానికి చర్యలు

కాకినాడ క్రైం: స్థానిక రంగరాయ వైద్య కళాశాలలో అసంపూర్తిగా ఉన్న గర్ల్స్ హాస్టల్ నిర్మాణం పూర్తి చేసేందుకు తగిన చర్యలు చేపడతామని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రంగరాయ పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు డాక్టర్ ఆనంద్, డాక్టర్ వాడ్రేవు రవి తదితరులు ఎంపీని క్యాంపు కార్యాలయంలో కలిసి గర్ల్స్ హాస్టల్ దుస్థితిని వివరించడంతో ఆయన కళాశాలకు వచ్చి ప్రస్తుతం అందుబాటులో ఉన్న హాస్టళ్లను పరిశీలించారు. ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ ఎంపికి వసతి గృహాల నేపథ్యాలు, కళాశాల కార్యకలాపాలు, సమస్యలను వివరించారు.

నకిలీ మద్యంపై నేడు నిరసన

సామర్లకోట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నకిలీ మద్యం రాకెట్ విపరీతంగా పెరిగిపోయిందని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత పిలుపు మేరకు సోమవారం ఉదయం పెద్దాపురం ఎక్సైజ్ కార్యాలయం వద్ద నకిలీ మద్యంపై నిరసన తెలియజేయడం జరుగుతుందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యాన్ని ఒక కుటీర పరిశ్రమగా నిర్వహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ మద్యంపై ప్రజలను చైతన్య పరచడానికి నిర్వహిస్తున్న కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఉదయం 9 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయం వద్ద హాజరుకావాలని, అక్కడి నుంచి ర్యాలీగా పెద్దాపురం వెళ్లి నిరసన తెలియజేస్తామని తెలిపారు.

డ్రైవింగ్.. టెరిఫిక్!

- ఓ ట్రక్ డ్రైవర్ నిర్వాకంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- దుందుడుకుతనంతో సహనానికి పరీక్ష
- అవస్థ పడిన వాహన చోదకులు



ఇరుకుదారిలో వెళ్లి డివైడర్‌ను ఢీకొట్టి వాహనం

కాకినాడ క్రైం: ఓ ట్రక్కు డ్రైవర్ నిర్వాకం ప్రయాణికులను తీవ్ర ఇక్కట్లకు గురి చేసింది. గంటకు పైగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. శనివారం అర్ధరాత్రి ఓ వ్యక్తి టీఆర్ వాసుదేవ్ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో, ఏపి 04 టీడబ్ల్యూ 6508 నెంబరుతో ఉన్న ఫ్లాట్‌బెడ్ ట్రక్కు నగరంలోని త్రీ లైట్ జంక్షన్ మీదుగా వెళ్లి భానుగుడి వైపు ఉన్న టూ టౌన్ సాయి బాబా గుడి టర్నింగ్‌లోకి ప్రవేశించాడు. అటుగా వెళ్లే వాహన చోదకులు ఇది ఇరుకైన మార్గమని, ముత్తా వంతెన పై నుంచి వెళ్లాలని సూచించినా మొండిగా ముందుకు పోయి టర్నింగ్‌లో వాహనాన్ని ఇరికించాడు. దీంతో వెనక ఉన్న వాహనాలు ముందుకు కదలని పరిస్థితి తలెత్తింది. అయినప్పటికీ లారీని ముందుకు తీసుకువెళ్లేందుకు ట్రాఫిక్ నియంత్రణకు ఏర్పాటు చేసిన సిమెంట్ డివైడర్లను ఒకొక్కటీ తొలగించి పక్కన పడేసి ముందుకు సాగాడు. ఈ క్రమంలో ఓ రాయిని ఢీకొని డామేజీ చేశాడు. అయినా ముందుకు సాగిపోతున్న డ్రైవర్ మొండితనానికి విసుగెత్తిన సహ వాహనదారులు ఆ తతంగాన్ని సెల్‌ఫోన్లలో బంధిస్తుండగా వారిపైనా అతడు విరుచుకుపడ్డాడు. ఇంతలో చిన్న మార్గం ఏర్పడడంతో వెనుక వాహనాలు అందులోంచి రాంగ్ రూట్‌లో వెళ్లి టూటౌన్ వంతెన ఎక్కాయి. గంటకు పైగా తన వాహనంతో ఇతరులకు చుక్కలు చూపించాడు ఆ డ్రైవర్. అర్ధరాత్రి వేళల్లో ఇలా వ్యవహరించే వాహన చోదకులను నియంత్రించేందుకు పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.



సందు దొరకడంతో రాంగ్ రూట్‌లో వెళ్తున్న వాహనాలు



డివైడర్‌ను తొలగిస్తూ..